# సాక్షి
## పశ్చిమగోదావరి
ఆదివారం । 17 । డిసెంబర్ । 2023






### వాసవీ హోమం
పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక వాసవీ శాంతి థాంలో శనివారం వాసవీ హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



### నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం
ద్వారకాతిరుమల: చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్టుకు నిజామాబాద్‌కు చెందిన గరిమెళ్ల ప్రవీణ్ శనివారం రూ.1,00,001లను విరాళంగా అందజేశారు.



### భక్తజన సంద్రం
ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రం శనివారం భక్తులతో పోటెత్తింది. ఆలయంలోని అన్ని విభాగాలూ సాయంత్రం వరకు కిక్కిరిశాయి.

## న్యూస్‌రీల్

### త్వరితగతిన గృహ బిల్లులు



గృహ నిర్మాణాలు పరిశీలిస్తున్న ఆర్డీఓ

**తాడేపల్లిగూడెం రూరల్:** ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి నిర్మాణాలకు త్వరితగతిన బిల్లులు, మెటీరియల్ అందిస్తామని తాడేపల్లిగూడెం ఆర్డీఓ కె.చెన్నయ్య అన్నారు. శనివారం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామ సచివాలయం వద్ద ఇంటి నిర్మాణ లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామానికి 249 ఇళ్లు మంజూరు కాగా 159 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన లబ్ధిదారులను ప్రోత్సహించి, నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆదేశించారు. అనంతరం గ్రామంలోని లే అవుట్‌లో ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. హౌసింగ్ ఏఈ వైవీ వెంకట్రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

### టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పరీక్షల కిట్స్ అందిస్తున్న దృశ్యం

**నరసాపురం:** రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి అన్నారు. స్థానిక వైఎన్ కళాశాలలో శనివారం టెన్త్ చదువుతున్న ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు ప్రతిభకు ప్రేరణ పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. పరీక్షల కిట్లు అందించారు. ముఖ్య అతిథిగా శోభారాణి మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచడానికి చర్యలు చేపట్టామన్నారు. విద్యార్థులు భయాలు వీడి పరీక్షలకు సిద్ధం కావాలని, ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నరసాపురం సాంఘిక సంక్షేమశాఖ అధికారి కె.బాలు, వైఎన్ కళాశాల హెచ్‌ఆర్డీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చినిమిల్లి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, కళాశాల డీన్ గంధం రామకృష్ణ పాల్గొన్నారు.

### ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీరామమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష పదవికి గోపాలపురం మండలం కోమటికుంటకి చెందిన వెలగ శ్రీరామమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ పదవికి ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి గాధంశెట్టి శ్రీనివాసరావు, పర్యవేక్షకులు ఎం.వెంకటేశ్వరరావు ప్రకటించారు. ఈ సందర్భంగా స్థానిక రోటో రెస్టారెంట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కోమటికుంట సర్పంచ్‌గా రెండుసార్లు, ఎంపీటీసీగా ఒకసారి పనిచేసిన అనుభవం ఉందన్నారు. ఆర్యవైశ్య సంఘం సభ్యుడిగా, వైఎస్సార్ సీపీ నేతగా, ప్రజాప్రతినిధిగా విభిన్న రంగాల్లో ఉన్న నాయకత్వ అనుభవంతో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా తనకు లభించిన అవకాశంతో సంఘ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పేద ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

### హుండీ ఆదాయం లెక్కింపు
**కైకలూరు:** కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మ దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 93 రోజులకు రూ.5,02,592 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ కేవీ గోపాలరావు తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

# ముక్కోటి.. కోటి పుణ్యాల సాటి



చినవెంకన్న ఆలయ ఉత్తర ద్వారం



ద్వారకాతిరుమలలో నూతనంగా నిర్మించిన అదనపు క్యూలైన్లు

**ముక్తిమార్గం..**
**ఉత్తర ద్వార దర్శనం**
- చినవెంకన్న ఆలయంలో ముమ్మర ఏర్పాట్లు
- 22న గిరి ప్రదక్షిణ
- 23న ఉత్తర ద్వార దర్శనం
- శరవేగంగా ప్రత్యేక క్యూలైన్లు, గిరి ప్రదక్షిణ మార్గం అభివృద్ధి పనులు

**ద్వారకాతిరుమల:** ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్య క్షేత్రం ముక్కోటి వేడుకలకు ముస్తాబవుతోంది. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఈనెల 23న ఉదయం 4.30 గంటల నుంచి స్వామివారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే ముందురోజు 22న గిరి ప్రదక్షిణ మహోత్సవం కనులపండువగా నిర్వహించనున్నారు. ఆయా వేడుకల్లో భక్తులు వేలాదిగా పాల్గొంటారని ఆలయ అధికారులు అంచనా వేసి క్షేత్రంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంతో పాటు షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ప్రత్యేక క్యూలైన్లు, గిరి ప్రదక్షిణ మార్గం అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆయా పనులను ఈఓ వేండ్ర త్రినాథ రావు, ఈఈ డీవీ భాస్కర్, ఏఈఓలు మెట్టపల్లి దుర్గారావు, వాసు, ఆర్.లక్ష్మణస్వామి, పి.నటరాజా రావు, సూపరింటెండెంట్లు హయగ్రీవ, రాజు, ఆర్. హనుమంతాచార్యులు, డీఈ టి.సూర్యనారాయణ శనివారం పరిశీలించారు.

### వేడుకలు జరిగేదిలా..
- 22న మధ్యాహ్నం 2 గంటలకు శ్రీవారి పాదుకా మండపం వద్ద గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుంది.
- యాత్ర మల్లేశ్వరం (దొరసానిపాడు రోడ్డు) నుంచి రాళ్లకుంట మీదుగా శ్రీవారి కొండపైకి, అక్కడి నుంచి ఉగాది మండపం మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంటుంది.
- రాత్రి 7 గంటల నుంచి స్వామివారు భక్తులకు నిజరూప దర్శనమిస్తారు.
- 23న ఉదయం 4.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు శ్రీవారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిస్తారు.
- ప్రస్తుతం ఉన్న రూ.100, రూ.200 టికెట్లతో పాటు ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేకంగా రూ.500 టికెట్లు ఇవ్వనున్నారు. వీటిని ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు.

**సౌకర్యాల కల్పన దిశగా..**
శ్రీవారి ఉత్తర ద్వార దర్శనార్థం క్షేత్రానికి వచ్చే వీఐపీలు, వీవీఐపీలతో పాటు సాధారణ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. త్వరితగతిన స్వామి దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు క్యూలైన్లను నిర్మిస్తున్నారు. అలాగే గిరి ప్రదక్షిణ జరిగే మార్గంలో భక్తులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలను సమకూర్చేందుకు చర్యలు తీసుకున్నారు.

### శ్రీవారి వైభవాన్ని చాటేలా..



శ్రీవారి వైభవాన్ని చాటేలా గిరి ప్రదక్షిణ, ముక్కోటి వేడుకలను నిర్వహించనున్నాం. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నాం. గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులందరికీ అదేరోజు రాత్రి 7 గంటల నుంచి స్వామివారి నిజరూప దర్శన భాగ్యాన్ని కల్పిస్తాం. వీఐపీలు, వీవీఐపీలతో పాటు సాధారణ భక్తుల సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తాం. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలి.
– వేండ్ర త్రినాథరావు, శ్రీవారి దేవస్థానం ఈఓ

## పౌరుషానికి ప్రతీక.. మీసాల వెంకన్న

**నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు**



మీసాల వెంకన్నస్వామి

**కైకలూరు:** ముఖంపై మెలితిరిగిన మీసాలు.. బొడ్డులో కత్తితో పౌరుషానికి ప్రతీకగా కైకలూరులో భూసమేత వేంకటేశ్వరస్వామి (మీసాల వెంకన్న) దర్శనమిస్తున్నారు. ఆదివారం నుంచి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. క్రీస్తు శకం 1628లో ఆలయాన్ని నిర్మించినట్టు శిలాశాసనాలు ఉన్నాయి. ఆలయంలో ఏటా బ్రహ్మోత్సవాలు, గ్రామోత్సవం, ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

**సర్వం సిద్ధం :** ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం నుంచి జనవరి 14 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. 23న ముక్కోటి ఏకాదశి, జనవరి 11న కుడార్రై ఉత్సవం, 14న గోదాదేవి కల్యాణం జరుగనున్నాయి. రోజూ తీర్థ బిందె, తిరుప్పావై ప్రవచనం, అష్టోత్తర శత నామార్చన, సహస్ర నామార్చన, సాయంకాలార్చన, శ్రీమన్నారాయణ గోష్ఠి ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామార్చనలు నిర్వహించనున్నారు.

**బొడ్డులో కత్తి ప్రత్యేకత :** మీసాల వెంకన్న ఆలయాలు ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో ఉన్నప్పటికీ బొడ్డులో కత్తి ఉండటం ఇక్కడ ప్రత్యేకం. పాండిచ్చేరిలోని యానాం, కాకినాడ జిల్లా యండమూరు, ఖమ్మం జిల్లా కందుకూరు, మహబూబాబాద్ జిల్లా మద్రిగూడెం, గుంటూరు జిల్లా అనంతపురం, కడప జిల్లా బొమ్మెపల్లిలలో మీసాల వెంకన్న ఆలయాలు ఉన్నాయి. ఇక్కడి ఆలయంలో ముక్కోటి నాడు స్వామివారు ఉత్తర ద్వారంలో దర్శనమిస్తారని ఆలయ ఈఓ వీఎస్‌కే శేఖర్ తెలిపారు. ముక్కోటికి పటిష్ఠ ఏర్పాట్లు చేస్తామన్నారు.



కైకలూరులో మీసాల వెంకన్న ఆలయం

# రూ.112 కోట్లతో ‘ఆడుదాం ఆంధ్ర’

**మంత్రి కారుమూరి నాగేశ్వరరావు**



విజేతకు ట్రోఫీ అందిస్తున్న మంత్రి కారుమూరి

**తణుకు టౌన్:** రాష్ట్రంలో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సాహించాలనే లక్ష్యంతో రూ.112 కోట్లతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ బాడీ బిల్డింగ్ పోటీల బహుమతి ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడాపోటీలు నిర్వహించి క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. విద్యార్థులను అందరూ క్రీడాపోటీలకు ప్రోత్సహించాలన్నారు. శారీరక ఆరోగ్యం ద్వారానే బాడీ బిల్డింగ్ పోటీల్లో రాణిస్తారన్నారు. శరీర సౌష్ఠవ పోటీల్లో విజేతలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. తణుకు ప్రభుత్వ కళాశాలలో మెరుగైన కార్యక్రమాలు నిర్వహించి అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. అనంతరం విజేతలకు ఆయన బహుమతులు అందించారు. మంత్రి కారుమూరి, కళాశాల సీపీడీసీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, పారిశ్రామికవేత్త చిలుకూరి రామకృష్ణను ప్రిన్సిపాల్, అధ్యాపకులు సత్కరించారు. మిస్టర్ ఆదికవి నన్నయ యూనివర్సిటీ 2023–24 ట్రోఫీని కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి కె.పవన్ కుమార్ గెలుచుకున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ముందుగా కళాశాల పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన సైకిల్ షెడ్‌ను మంత్రి కారుమూరి ప్రారంభించి, చదువుల తల్లి సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

## అట్టహాసంగా తెలుగు సాహిత్య, కళా ఉత్సవాలు



ర్యాలీని ప్రారంభిస్తున్న హోం మంత్రి వనిత

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో స్థానిక బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో శనివారం ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 30 గంటల పాటు నిర్విరామంగా జరిగే ఉత్సవాల ర్యాలీని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళలు, సాహిత్యాన్ని శ్రీశ్రీ కళావేదిక వెలికితీయడం అభినందనీయమన్నారు. రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిళ్లంగోళ్ల శ్రీలక్ష్మి జ్యోతి ప్రజ్వలన గావించారు. ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు జరిగే సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు, పాల్గొనేందుకు కవులు, రచయితలు, ఉపాధ్యాయులు, సాహితీ వేత్తలు, ప్రముఖులు హాజరయ్యారు. కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో జాతీయ సమన్వయకర్త కొల్లి రమావతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. తొలుత కవులు, కళాకారులు ప్రాచీన వేషధారణలు, రంగస్థల ప్రదర్శనలతో బస్సు కాంప్లెక్స్ వద్ద నుంచి శేషమహల్, మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓటీఎస్ పట్టాల పంపిణీ

**వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీరంగనాథరాజు**



కరుగోరుమిల్లిలో ఓటీఎస్ పట్టాలు అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

**పెనుగొండ:** పదిహేనేళ్ల పాటు అవినీతికి ఎవరు పాల్పడ్డారో ప్రజలకు తెలుసునని, ఓటమి భయంతో ఎన్ని ఆరోపణలు చేసినా ఫలితం ఉండదని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం ఆచంట మండలం కరుగోరుమిల్లిలో 133 మంది లబ్ధిదారులకు ఓటీఎస్ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను కించపరిచేలా మాజీ మంత్రి పితాని వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఆచంట నియోజకవర్గంలోనే కాదు, గుంటూరు, అల్లంపురం ఆస్పత్రుల్లో రోగులు, ద్వారకాతిరుమల పాదయాత్రకు వెళ్లే భక్తులు వేలాది మందికి భోజనం పెడుతున్నామన్నారు. దీనిని పితాని వక్రీకరించారని, కార్యాలయానికి వచ్చిన వారికి భోజనం పెట్టడంపైనా రాజకీయం చేయడం సరికాదన్నారు. పితాని మాదిరిగా తాను ఎక్కడా ఇసుక, అభివృద్ధి పనుల్లో అవినీతికి పాల్పడలేదన్నారు. స్థాయి మరిచి ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరేలా పాలనను పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. మిచాంగ్ తుపానులో నష్టపోయిన రైతులకు సంక్రాంతిలోపు నష్టపరిహారం ఇచ్చేలా సీఎం జగన్ సన్నాహాలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, వైస్ చైర్మన్ గుబ్బల వీర బ్రహ్మం, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, సర్పంచ్ బోడపాటి బుల్లియ్య, ఇన్‌చార్జి ముత్యాల నాగేశ్వరరావు, మొల్లేటి రామకృష్ణ, ముత్యాల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయమూర్తులకు వర్క్‌షాప్



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్

**ఏలూరు(మెట్రో):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని న్యాయమూర్తులతో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. శనివారం ఉదయం ఏలూరు చేరుకున్న ఆయనకు ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్, మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామ్‌గోపాల్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఆంధ్రప్రదేశ్ బార్ అసోషియేషన్ సభ్యులు బీవీ కృష్ణారెడ్డి, ఏలూరు బార్ అసోషియేషన్ సభ్యులు ఎ.విజయ్‌కుమార్, రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. తదుపరి కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా న్యాయమూర్తులతో ఏర్పాటుచేసిన వర్క్‌షాప్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్, తెలంగాణ హైకోర్టు రిటైర్డ్ జడ్జి బి.శివశంకరరావుతో కలిసి వర్క్‌షాప్ నిర్వహించారు. క్రిమినల్ కేసుల్లో వాస్తవ ఔచిత్యం ఒక అవలోకనం, సెక్షన్–1 విజయాలు, ప్రేరణ తయారీ, ప్రవర్తన ఔచిత్యం, పరీక్ష గుర్తింపు కాలాలు, అలీబీ, సెక్షన్ల–2 క్రిమినల్ కేసుల్లో అడ్మిషన్లు, కన్ఫెషన్ తదితర అంశాలపై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ బి.వసంతలక్ష్మి, పి.వెంకటేశ్వర్లు, రిటైర్డ్ జిల్లా జడ్జి ఏవీ పార్థసారథి (రిసోర్స్ పర్సన్), ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ



కలెక్టర్ ప్రశాంతి

**భీమవరం (ప్రకాశం చౌక్):** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణలో భాగంగా రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధుల నుంచి అందిన ఫిర్యాదులపై విచారణ పారదర్శకంగా చేపట్టినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈనెల 9లోపు వచ్చిన క్లెయిమ్స్, అభ్యంతరాల ఫిర్యాదులను ఈనెల 26వ తేదీలోపు విచారణ చేసి పరిష్కరించి జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఈ విషయమై రాజకీయ పార్టీల నాయకులు కూడా యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఈవీఎంలు ఏ విధంగా ఉపయోగించాలి, ఓటింగ్ విధానంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఫిర్యాదుల పరిష్కారం పారదర్శకంగా జరుగుతోందని, తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేసేందుకు అందరూ సహకారం అందించాలని ఆమె కోరారు. 18 ఏళ్లు నిండిన వారితో పాటు 17 ఏళ్ల వయసున్న వారు కూడా ప్రోగ్రెసివ్ ఓటర్లుగా నమోదు కావచ్చునన్నారు. జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ 1వ తేదీ ప్రాతిపదికగా 18 ఏళ్లు నిండగానే ఓటరుగా నమోదవుతారన్నారు.

# చలి భయం.. అప్రమత్తత అవసరం

- పెరుగుతున్న చలిగాలులు
- పిల్లలు, వృద్ధులకు జాగ్రత్తలు తప్పనిసరి



భీమవరం (ప్రకాశం చౌక్) : శీతాకాలం ప్రారంభమై నెలదాటినా మిచాంగ్ తుపాను దెబ్బకు పెద్దగా చలి తీవ్రత లేదు. అయితే గత ఐదు రోజుల నుంచి చలి పులి ప్రజలను భయపెడుతుంది. ముఖ్యంగా చలి తీవ్రత నెమ్మదిగా పెరుగుతూ సాయంత్రం 5 గంటలకే వాతరణం పూర్తిగా చల్లబడిపోతుంది. ఈ క్రమంలో చలి వల్ల జలుబు, జ్వరాల బారిన పడే అవకాశం ఉంది. చిన్నారులు, వృద్ధులు, వివిధ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నవారు చలి నుంచి రక్షించుకొవడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

**కోవిడ్ బాధితులూ తస్మాత్ జాగ్రత్త**

గతంలో కోవిడ్ బారినపడి కోలుకున్న వారు ఈ సీజన్‌లో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. డయాబెటిస్, ఆస్తమా, పొగ తాగే అలవాటు ఉన్నవారు, క్యాన్సర్, ఊపిరితిత్తుల్లో నీరు చేరిన వారు జాగ్రత్తలు పాటించాల్సిందేనని పేర్కొంటున్నారు. ముఖ్యంగా శ్వాస నాళాలు ముడుచుకుపోయే అవకాశం ఈ సీజన్‌లో అధికంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

**జాగ్రత్తలు ఇలా**

- శీతాకాలంలో చర్మం పొడి బారిపోతుంటుంది. అందువల్ల మాయిశ్చరైజర్లు తప్పనిసరిగా వినియోగించాలి.
- చలికాలంలో చాలా మంది నీరు తాగడం తగ్గిస్తారు. అలా చేయకుడదు. తగిన మోతాదులో నీళ్లు కచ్చితంగా తాగాలి.
- ఐస్‌క్రీమ్ చల్లని నీరు, చల్లని పదార్థాలకు దూరంగా ఉండడం మేలు
- దుమ్ము, ధూళి ఉండే ప్రాంతాలకు దూరంగా, చలిగాలుల్లో తిరగడం మానేయాలి.
- ఇమ్యూనైజేషన్ వ్యాక్సిన్ ఏడాదికి ఒకసారి, న్యూమోనియా వ్యాక్సిన్ ఐదు సంవత్సరాలకు ఒకసారి వైద్యుల సూచనలతో వేసుకుంటే మంచిది.
- గోంగూర, వంకాయ, కొబ్బరికాయ వంటి పదార్థాలను ఈ కాలంలో తినడం తగ్గించాలి.
- ఎండు చేపలు తినడం మానేయాలి. దీనిలో అధికంగా ఉండే ఉప్పు ఇబ్బందికరంగా మారుతుంది.
- ఇండోర్ వ్యాయామం, జిమ్ చేసే విధంగా ప్లాన్ చేసుకోవాలి.
- బయటకు వెళ్లే సమయంలో తగినంత వేడిని శరీరానికి అందించే ఉన్ని దుస్తులు ధరించాలి.
- ఇంటిలో ఎవరికైనా జలుబు, దగ్గు వస్తే వైద్యుల సూచనలతో మందులు వాడాలి. సొంత వైద్యం సరికాదు. కుటుంబంలో ఒకరికి వాడే ఔషధాలు వేరొకరికి వినియోగించడం సరికాదు.
- శీతాకాలంలో శ్వాస సంబంధిత సమస్యలు ఎదురైతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

**జాగ్రత్తలు తప్పనిసరి**



శీతాకాలంలో జాగ్రత్తగా ఉండాలి. చలి నుంచి శరీరాన్ని రక్షించుకోవాలి. ఈ కాలంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచే విటమిన్ సీ కలిగిన పదార్థాలు, సీజనల్ ఫ్రూట్స్ తీసుకోవాలి. గోరువెచ్చని నీటిని తీసుకోవాలి. ముఖ్యంగా గతంలో కోవిడ్ బారినపడిన వారు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. విలేజ్ క్లినిక్‌లు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల వైద్య సేవలను ఉపయోగించుకోవాలి.

– డాక్టర్ ఎం.వీరాస్వామి సూపరింటెండెంట్ భీమవరం ప్రభుత్వ ఆస్పత్రి

## ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



అలంపురంలో విజయ్ దివస్ కార్యక్రమంలో

పెంటపాడు: దేశం కోసం ప్రాణాలొదిలిన వీరజవాన్లను నేటి యువతకు ఆదర్శంగా తీసుకోవాలని తాడేపల్లిగూడెం ఎన్ఐటీ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ వీరేష్‌కుమార్ కోరారు. పెంటపాడు మండలం అలంపురం గ్రామంలో రాష్ట్ర మాజీ సైనికుల ఉద్యోగ సంఘ నేత, టీబీఆర్ సంస్థల అధినేత తనబుద్ధి భోగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 52వ కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా వీరజవాన్ల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ వీరేష్‌కుమార్ మాట్లాడుతూ జవాన్లు నిజమైన హీరోలని కొనియాడారు. ఈ సందర్భంగా యుద్ధంలో పాల్గొన్న సుమారు 50 మందికి పైగా వీరజవాన్లను, వారి కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. అనంతరం సైనిక సంక్షేమ నిధి కోసం సేకరించిన 3.5 లక్షల చెక్కును జిల్లా సైనిక సంక్షేమ అధికారి ప్రసాద్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో సుబేదార్ యు.రాజు, బొల్లం వీరయ్య, శివకుమార్, ఆలోక్‌సింగ్, టీబీఆర్ సైనిక్ స్కూల్ కరస్పాండెంట్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారయత్నం

ఉండి: మైనర్‌బాలికపై అత్యాచారయత్నం చేసిన వివాహితుడిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం పడవలవానిపేటకు చెందిన నల్లూరి అంజిబాబు అనే వివాహితుడు వరుసకు మేనత్త కుమార్తె అయిన బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఈ ఏడాది దసరా సెలవులకు ఆమె పడవలవానిపేటకు రావడంతో ఈ దారుణం జరిగింది. అయితే ఆ బాలిక ఈ ఘటన జరిగిన తర్వాత దూరప్రాంతంలో ఉన్న హాస్టల్‌కు వెళ్లిపోయింది. అక్కడకు వెళ్లినప్పటి నుంచి బాలిక నీరసంగా, ముభావంతో ఉండడాన్ని గమనించిన ఉపాధ్యాయులు ఆమెను ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. వారి సాయంతో శుక్రవారం ఉండికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేయగా, శనివారం నిందితుడిపై కేసు నమోదు చేశారు. ఈ కేసును దిశ డీఎస్పీ ఎన్.మురళీకృష్ణ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్సీ మరణం బాధాకరం

**ఎంపీ కోటగిరి శ్రీధర్ నివాళులు**

దెందులూరు: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. శనివారం ఏలూరు ఎంపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా, ఉద్యోగ సంఘ జిల్లా, రాష్ట్ర నేతగా ఎమ్మెల్సీగా ఉపాధ్యాయ రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఎమ్మెల్సీగా ఉపాధ్యాయ వాణిని చట్టసభల్లో వినిపించడమే కాకుండా ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేసిన సాబ్జీ అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదంలో ఇలా మృతి చెందడం జీర్ణించుకోలేని విషయమన్నారు. సాబ్జీ కుటుంబానికి ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఉత్సాహంగా ఏకేఎన్‌యూ బాడీ బిల్డింగ్ పోటీలు



మెడల్స్ అందజేస్తున్న రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు టౌన్: ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ (ఏకేఎన్‌యూ) ఇంటర్ కాలేజీయేట్ బాడీ బిల్డింగ్ పోటీలు శనివారం తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీల్లో యూనివర్సిటీ పరిధిలోని వివిధ ప్రభుత్వ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొని తమ శరీర సౌష్టవాలను ప్రదర్శించారు. ఈ పోటీలకు డాక్టర్ డీవీ రమణ పరిశీలకులుగా వ్యవహరించగా, సహాయకుడిగా ఎస్వీ సతీష్ బాబు, న్యాయనిర్ణేతలుగా ఎం.వెంకటేశ్వరరావు బృందం వ్యవహరించింది. పోటీల్లో మిస్టర్ 2023-24 యూనివర్సిటీ టైటిల్‌ను కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన కె.పవన్‌కుమార్ సాధించగా, టీమ్ చాంపియన్‌షిప్‌ను కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 22 పాయింట్లతో సాధించారు. ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్ర పౌర సరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మెడల్స్, మెమెంటోలు అందజేశారు. వీటితో పాటు జిల్లా స్థాయిలో కళాశాల విద్యార్థులకు నిర్వహించిన రెడ్ రిబ్బన్ రన్‌లో ప్రథమ బహుమతుల పొందిన తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి వై.ఏసుసత్యకు రూ. 10 వేలు, తృతీయ స్థానం సాధించిన ఎం.హిమేష్ కుమార్‌కు రూ. 5 వేల పారితోషికానికి సంబంధించిన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అనిల్‌కుమార్, కళాశాల సీపీడీసీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, పారిశ్రామికవేత్త చిలుకూరి రామకృష్ణ, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మంగెన సూర్య తదితరులు పాల్గొన్నారు.

## బైక్ షోరూమ్స్‌లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఆకివీడు: వివిధ మోటారు సైకిళ్ల షోరూమ్‌లలో దొంగతనాలకు పాల్పడిన గుబిలి సుబ్రహ్మణ్యం అనే వ్యక్తిని స్థానిక ఉప్పుటేరు వంతెన సమీపంలో అరెస్టు చేసినట్లు ఎస్సై బి.నాగబాబు చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏలూరు జిల్లా ముదినేపలి మండలం పెదగొన్నూరు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం వాహనాలు కొనుగోలు చేస్తున్నట్లుగా ఆయా మోటారు సైకిళ్ల షోరూమ్స్ వద్దకు వెళ్లి రెక్కీ జరిపి, రాత్రికి దొంగతనాలకు పాల్పడుతుంటాడని ఎస్సై తెలిపారు. ఈ తరహాలో గణపవరం, ఆకివీడులలోని మోటారు సైకిళ్ల షోరూమ్‌లలో దొంగతనాలకు పాల్పడగా అతని వద్ద నుంచి రూ. 4.30 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆకివీడు పరిధిలో రెండు షాపుల్లో దొంగిలించిన రూ.1.90 లక్షలు, రూ.2.40 లక్షలతోపాటు రెండు డీవీఆర్‌లు, గణపవరం షాపులో రూ.4,200 నగదు మూడు డీవీఆర్ బాక్సులు దొంగిలించగా, మూడు డీవీఆర్ బాక్సులు రికవరీ చేసినట్లు ఎస్సై వివరించారు. ముద్దాయి సుబ్రహ్మణ్యాన్ని చాకచక్యంగా పట్టుకున్న ఆకివీడు కానిస్టేబుల్ కె.చిన్నపండు, కాళ్ల కానిస్టేబుల్ ఎస్‌కే రాజేష్, ఉండి కానిస్టేబుల్ కె.సీహెచ్. వెంకటరత్నం తదితరులను అభినందించారు. ముద్దాయిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై వివరించారు.

## ఆర్టీసీ కార్గోలో డోర్ పికప్ సేవలు

ఆర్టీసీ జోన్ -2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథరెడ్డి



ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ కార్గో సేవలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని, ముఖ్యంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజలు ఆర్టీసీ కార్గో సేవలను అధికంగా వినియోగించుకుంటూ ఆదరించడంపై ఆర్టీసీ జోన్ -2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే. గోపీనాథ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఏలూరు ఆర్టీసీ డిపోను ఆయన తనిఖీ చేశారు. అనంతరం స్థానిక జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్గోకు లభిస్తున్న ఆదరణతో డోర్ పికప్ సేవలను తొలుత విజయవాడలో ప్రారంభించనున్నట్లు, దానికి వచ్చే స్పందన ఆధారంగా రాష్ట్రం మొత్తం ఆ సేవలను విస్తరిస్తామని తెలిపారు. ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించకునే వినియోగదారులు బిల్లు కంటే అదనంగా ఎవ్వరికీ ఏమీ చెల్లించాల్సిన పని లేదని సూచించారు. ఇటీవల కార్తీక మాసం సందర్భంగా పంచారామ క్షేత్ర దర్శిని బస్సులకు, పలు శైవక్షేత్రాలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వీసులకు కూడా భక్తుల నుంచి మంచి ఆదరణ లభించిందని, ప్రస్తుతం ధనుర్మాసోత్సవాల నేపథ్యంలో ఏలూరు జిల్లాతో పాటు వివిధ జిల్లాల్లోని ప్రముఖ వైష్ణవ దేవాలయాల సందర్శన కోసం కూడా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఉన్నారు.

## క్లుప్తంగా

### ఎమ్మెల్సీ సాబ్జికి నివాళులు

**తణుకు టౌన్:** శాసన మండలి సభ్యుడు షేక్ సాబ్జి అకాల మృతి పట్ల ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాను ఎమ్మెల్సీగా ఎన్నికైన మొదటి సమావేశంలో ఆయన పక్కన బెంచీలోనే కూర్చున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుడుగా సేవలందించి వివిధ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారని తెలిపారు. సాబ్జి కుటుంబ సభ్యులకు వంక రవీంద్రనాథ్ తన సానుభూతిని తెలిపారు.

### సాబ్జి మృతి తీరనిలోటు

**తణుకు:** ఉపాధ్యాయ ఉద్యమ నేత, టీచర్స్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతికి అంగన్‌వాడీలు శనివారం ఘనంగా నివాళులర్పించారు. సీఐటీయూ నాయకులు ప్రతాప్, ఏఐటీయూసీ నాయకులు నాగరాజు, సొసైటీ ఉద్యోగుల నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

### సర్పంచ్‌లు బాధ్యతలను గుర్తెరగాలి



తాడేపల్లిగూడెంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాస్టర్ రవిచంద్ర

**తాడేపల్లిగూడెం రూరల్:** సర్పంచ్‌లు తమ బాధ్యతలు గుర్తెరిగి నడుచుకోవాలని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, గ్రేడ్–1 నుంచి 6 పంచాయతీ కార్యదర్శులకు విధులు, బాధ్యతలు, హక్కులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ మాట్లాడుతూ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. మాస్టర్ ట్రయినీ రవిచంద్ర శిక్షణనిచ్చారు. ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ హనుమ

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ హనుమ కోరారు. పట్టణంలో సంజీవనగర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ హనుమ మాట్లాడుతూ పరీక్షల సమయాల్లో విద్యార్థులు పట్టుదలతో చదవాలన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు అందరు మంచి ఉన్నత స్థానాలలో ఉండాలని ఆకాంక్షించారు.

### ఉచిత హోమియో వైద్య శిబిరం

**అత్తిలి:** మండలంలోని బల్లిపాడు ఉమర్ ఆలీషా ఆశ్రమంలో శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. పిఠాపురం విశ్వవిజ్ఞాన ఆధ్యాత్మిక పీఠం అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో ఈ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మక్కా సూర్యనారాయణ

**అత్తిలి:** అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయం చేసుకుని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అన్నారు. శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షత జరిగింది. తుఫాన్ వల్ల దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని లక్ష్మీనారాయణపురం ఎంపీటీసీ సభ్యుడు ఆడారి శ్రీనివాస్, అత్తిలి ఎంపీటీసీ సభ్యుడు బుద్దాల రాంబాబు కోరారు. విద్యుత్ బిల్లులలో లోపాలను సరిచేయాలని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. వరిఘేడు గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని జెడ్పీటీసీ సభ్యురాలు అద్దాల జానకి సభ దృష్టికి తీసుకువచ్చారు. గృహనిర్మాణంలో ఉపాధి హామీ నిధులు సకాలంలో జమ కావడం లేదని గుమ్మంపాడు సర్పంచ్ వేగేశ్న ధనసత్యనారాయణరాజు తెలిపారు. తెల్లకార్డు దారులకు కంది పప్పు సరఫరా చేయాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు కోరారు. పంటనష్టపోయిన రైతుల వివరాలను ఈనెల 18న గ్రామ పంచాయతీల వద్ద ప్రదర్శిస్తామని, తుది జాబితా ఈనెల 26లోపు జిల్లా అధికారులకు పంపుతామని వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ తెలిపారు. ముందుగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీచర్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైస్ ఎంపీపీలు సుంకర నాగేశ్వరరావు, దారం శిరీషా, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఎంపీడీవో అమీలుజమా, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలలో సౌకర్యాలు భేష్

**మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు**



తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైకిల్ షెడ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

**తణుకు టౌన్:** తణుకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పించేందుకు పూర్వ విద్యార్థులు కృషి అభినందనీయమని రాష్ట్ర పౌర సరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శనివారం కళాశాలలో చదివే విద్యార్థినీ, విద్యార్థుల కోసం పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన సైకిల్ షెడ్, మంచినీటి కోసం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. కళాశాల ఆవరణలో తీర్చిదిద్దిన సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్య సంస్థలను ప్రభుత్వం నాడు నేడు కార్యక్రమంలో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. తణుకు కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్ కుమార్ సారథ్యంలో కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి అభినందించారు. త్వరలో జరిగే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి కళాశాల నుంచి విద్యార్థులు పాల్గొని జిల్లా, రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించాలని కోరారు. కళాశాల సీపీడీసీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, పారిశ్రామికవేత్త చిలుకూరి రామకృష్ణ, బెల్లంకొండ బుచ్చిబాబు అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

### 115 మందికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని ఆరుగొలను గ్రామంలో శనివారం ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఆత్మబంధువులం సేవా సంఘం, గ్లోబల్ గ్రేస్ హెల్త్ (హైదరాబాద్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 115 మందికి కేన్సర్ పరీక్షలు చేశారు. తొలుత శిబిరాన్ని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న శిబిరాలను వినియోగించుకుని, వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మబంధువులం సేవా సంఘం ఫౌండర్ శీతాళం ఉషాకిరణ్, ఆరుగొలను, నవాబుపాలెం సొసైటీ చైర్మన్లు చిక్కాల సత్యనారాయణ, జడ్డు హరిబాబు, సభ్యులు కేవీ.చలం, పూతినీడి పరమాత్మ, కాకర్ల నవీన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఏపీ రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు కొనియాడారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో శనివారం మాల మహానాడు ఆధ్వర్యంలో మంగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్ర ప్రజలకు ఎన్నో సంక్షేమాలు అమలు అవుతున్నాయని కొనియాడారు. ప్రజల మనన్నలు ముఖ్యమంత్రి పొందుతున్నారని చెప్పారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 630 వాగ్దానాలు చేసి, కనీసం 30 హామీలు కూడా అమలు చేయకుండా మోసగించిన మోసగాడు చంద్రబాబు నాయుడని విమర్శించారు. చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కోసం అహర్నిశలు కష్ట పడేవారికి పార్టీలో అత్యంత ప్రాధ్యానత స్థానం తప్పక ఉంటుందన్నారు. ముఖ్యమంత్రివర్యులు ఎవరికి టిక్కెట్లు ఇచ్చినా జగన్‌మోహన్‌రెడ్డి గ్రాఫ్ వలనే తిరిగి గెలవడం ఖాయమని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు పి.బాలకృష్ణ, సునీల్ బాబు, భరత్‌లు పాల్గొన్నారు.

## పంచాయతీ శాఖలపై అవగాహన అవసరం

**పెంటపాడు:** గ్రామ పంచాయతీలోని ప్రతి అంశం, ప్రతిశాఖపైనా అధికారులు పూర్తి అవగాహనతో ఉండాలని ఎంపీడీవో సీహెచ్ బాలజీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లకు సాధారణ పరిపాలన, ఆదాయ వ్యయాలు, ఆస్తుల సంరక్షణ, ప్రజారోగ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ ప్రసాద్, ఎంఈవో టీ వీ రామకృష్ణ, టీవీ సత్యనారాయణ, కార్యదర్శులు రామకృష్ణ, చక్రవర్తి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుల హక్కులపై అవగాహన

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** వినియోగదారుల హక్కులపై విద్యార్థినీ విద్యార్థులు, ప్రతి ఒక్కరు అవగాహన కల్పించుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సీతారామరాజు ఆధ్వర్యంలో శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వినియోగదారులు–హక్కులపై సదస్సు నిర్వహించారు.

# వినోదంతో మానసిక ఉల్లాసం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న యువనేత కొట్టు విశాల్

**తాడేపల్లిగూడెం అర్బన్:** ప్రస్తుతం స్పీడ్‌యుగంలో పనుల ఒత్తిడితో క్షణం తీరిక లేకుండా జీవితాన్ని గడుపుతున్న ప్రజలకు వినోదం మానసిక ఉల్లాసాన్ని ప్రశాంతతను ఇస్తుందని వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ పేర్కొన్నారు. స్థానిక తణుకు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన రెహామ్స్ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను శనివారం కొట్టు విశాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ సరికొత్త అంశాలతో వినూత్నమైన రీతిలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన నిర్వాహకులు అభినందించారు. విజయవాడ, విశాఖపట్టణం వంట మహానగరాలకు మాత్రమే పరిమితమైన అండ్ ఫిష్ టన్నెల్‌ను తాడేపల్లిగూడెంలో మొదటిసారి ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. సుబ్రహ్మణ్యస్వామి షష్టిని పురస్కరించుకొని పట్టణ, పరిసర ప్రాంతాల వారు ఈ ఎగ్జిబివషన్‌ను సందర్శించి ఉల్లాసాన్ని పొందుతారని అభిలషించారు. అండర్ ఫిష్‌టన్నెల్ ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ నిర్వాహకులు షేక్ అబ్దుల్ మొహయుద్దీన్‌ఖాన్, మండలి నాగేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తమ్మిశెట్టి రంగా సురేష్, చింతకాయల దొరబాబు, శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# దోమల వ్యాప్తిని అరికట్టాలి



ఎల్.అగ్రహారం గ్రామంలో కీటక జనీత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం రూరల్:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమల వ్యాప్తిని అరికట్టాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. శనివారం మండలంలోని ఎల్.అగ్రహారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కీటక జనీత వ్యాధులు, డ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పొడి వాతావరణం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. వీటిని తమ తల్లిదండ్రులకు విద్యార్థులు తెలియజేయాలన్నారు. అనంతరం రామన్నగూడెం గ్రామంలో జరుగుతున్న ఫీవర్ సర్వే, కీటక జనీత వ్యాధులు, వాటిని నియంత్రించాల్సిన ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శి గంగాదేవి, ధనమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు ఇందిరా ప్రియాంక, నాగేశ్వరరావు, ఆరోగ్య సహాయకులు రాధాకృష్ణ, ఆర్.కాంతారావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 18న కలెక్టరేట్ వద్ద ఫీల్డ్ అసిస్టెంట్ల ధర్నా



ధర్నా కార్యక్రమానికి సంబంధించి వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు

**అత్తిలి:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల డిమాండ్ల సాధన కోసం ఈనెల 18న కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ల జిల్లా యూనియన్ అధ్యక్షుడు తేలి శాంతి స్వరూప్ శనివారం తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, మండల స్థాయి బదిలీలు , ఉద్యోగ భద్రత, జూనియర్ ఎఫ్‌ఏలకు ఎస్టీల సౌకర్యం తదితర డిమాండ్లపై ఈధర్నా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఫీల్డ్ అసిస్టెంట్లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దీనిపై జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని స్వరూప్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రమేష్, మహేష్ రెడ్డి, బాలకృష్ణ, అబ్రహం, స్వాతి, ఈశ్వరరావు, పిల్లి ఏసురత్నం పాల్గొన్నారు.

## నేడు సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం



తణుకులో ముస్తాబైన నటరాజ సీతారామ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం

**తణుకు అర్బన్:** షష్టి సందర్భంగా వల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవానికి పండితులు సర్వం సిద్ధం చేశారు. తణుకు గోస్తనీ కాలువ సమీపంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వేంచేసియున్న శ్రీ నటరాజ సీతారామ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ఆలయ ఆవరణ అంతా చలువ పందిర్లు వేసి విద్యుత్ దీపాల వెలుగులతో తీర్చిదిద్దారు. ఆలయ రహదారి పొడవునా చలువ పందిర్లు వేసి భక్తులు క్యూలో వెళ్లే విధంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 17వ తేదీ ఉదయం స్వామి వారిని పెండ్లి కుమారుడిగాను, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా అలంకరించి ఆలయ అర్చకులు అల్లవరపు వెంకట కేదార కపర్ధి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణముల మధ్య సాయంత్రం 6 గంటలకు స్వామి అమ్మవార్ల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ తెలిపారు. 18వ తేదీ తెల్లవారుజాము స్వామివారికి ప్రత్యేక అభిషేకాల అనంతరం 3 గంటల నుంచి స్వామి వారి దివ్య దర్శనం, షష్టి తీర్థానికి ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

### పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ

**ఇరగవరం:** ఇరగవరం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రేడ్- 1 నుంచి గ్రేడ్ -6 పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు పంచాయతీ పరిపాలనా విధానం, ఆర్థిక వ్యవహారాలపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతయారు. ఎంపీడీవో పీవీఎస్ నరశింహమూర్తి, ఈవోఆర్డీ జి వెంకటలక్ష్మి, రిసోర్సు పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

### కవి సోమేపల్లి మృతి పట్ల సంతాపం

**తణుకు:** ప్రముఖ కవి, విశ్రాంత సబ్ కలెక్టర్ సోమేపల్లి వెంకటసుబ్బయ్య మృతి పట్ల తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ సినీ గేయరచయిత రసరాజు సంతాపం తెలిపారు.ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**పబ్లిక్ నోటీసు**

తెలంగాణా స్టేట్, రంగారెడ్డి జిల్లా, మణికొండ, హైదర్ నగర్, వైదేహి నగర్ రోడ్ నెం.10, ప్లాట్ నెం.540 లో నివాసం ఉంటున్న వంగేటి చంద్రబాబు గారి కుమారుడు సురేంద్ర అను నా క్లయింటు నాకు ఇచ్చిన సంతాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు వంగేటి సురేంద్ర గారు ది.14.12.2023న ... [illegible]

తోట రాంబాబు BAL.LLB.
అడ్వకేట్, విజయవాడ
తాడేపల్లిగూడెం
తేది.16.12.2023
సెల్: 98483 77437

**శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం**
మద్దూరు గ్రామం, కొవ్వూరు మండలం. తూ.గో.జిల్లా
**భూమి సేద్యపు టెండరు–కం–బహిరంగ వేలం ప్రకటన**

| క్ర.నెం. | గ్రామం | సర్వే నెంబరు | పల్లం/మెరక | విస్తీర్ణం ఎ.సెం. | ధరావత్తు |
|---|---|---|---|---|---|
| 1. | [illegible] | 476/8 | మెరక | 3.35 | 5,000/- |

ఇట్లు : మేనేజర్